క్లుప్తంగా

గని పోతురాజును దర్శించుకున్న జక్కంపూడి



ఆలయంలో స్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మండపేట: మండలంలోని కేశవరంలో గనిపోతురాజు ఉత్సవాల సందర్భంగా బుధవారం రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ కూసు వీరవెంకట సత్యనారాయణమూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారికి ఎమ్మెల్యే జక్కంపూడి పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మండల ఆర్బీకే కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, ఎంపీటీసీ అన్నందేవుల కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తుపాకుల ప్రసన్నకుమార్, మన్నే భూషణం, అద్దంకి రమణ, పురంశెట్టి శ్రీను, అబ్బిరెడ్డి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

చెత్తకుప్పలు తొలగించాలి

కాజులూరు: కాజులూరులో రోడ్లపై పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించేందుకు పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో డంపింగ్ యార్డ్ సదుపాయం లేకపోవడంతో స్థానికులు చెత్తా చెదారాన్ని గ్రామ ముఖద్వారంలోని రోడ్డు పక్కన పారేస్తున్నారు. దీనివల్ల రహదారికి ఇరువైపులా పారిశుధ్యం అధ్వానంగా తయారవుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే అధికారులు స్పందించి చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

131 మందికి వైద్య పరీక్షలు



తాతపూడిలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అనూజ ప్రియాంక

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీ వైద్యాధికారులు పీఎస్ఎస్‌డీ రత్నకుమారి, డాక్టర్ జె.అనూజ ప్రియాంక పర్యవేక్షణలో బుధవారం తాతపూడిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు 131 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. శిబిరంలో అనూజ ప్రియాంక మాట్లాడుతూ గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేశామన్నారు. వృద్ధులకు బీపీ, సుగర్ పరీక్షించి మందులను అందజేశామన్నారు. పౌష్టికాహార ప్రాధాన్యతపై హెచ్ఈ బి.రామారావు అవగాహన కల్పించారు. శిబిరంలో ఎంపీహెచ్ఎస్‌లు పి.సురేష్, టి.మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పి పి.దివ్యశ్రీ, పి.అనూష, కె.దీప్తి, తోట రామకృష్ణ, ఎం.దేవి సేవలందించారు.

ఫిలాటికల్ ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలి



ఫిలాటికల్ ప్రదర్శనలో స్టాంపులను తిలకిస్తున్న విద్యార్థులు

రామచంద్రపురం: అరుదుగా దొరికే స్టాంపులన్నింటినీ ఒకే చోట చూసేందుకు అవకాశమున్న ఫిలాటికల్ ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎం.లక్ష్మణ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రధాన తపాల కార్యాలయం వద్ద రెండు రోజుల పిలాటికల్ ప్రదర్శనను బుధవారం ఆయన ప్రారంభించారు. గతంలో తపాల శాఖ విడుదల చేసిన పోస్టల్ స్టాంపులు, తపాల కవర్లు ప్రదర్శనలో ఉంచుతామని చెప్పారు. స్టాంపుల సేకరణ చేసే పిలాటికల్స్, విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఈ ప్రదర్శన ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. హెడ్ పోస్టుమాస్టర్ విఠల్‌నాథ్, తపాల ఉద్యోగులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారులందరూ కేవైసీ చేయించుకోవాలి

కాజులూరు: జిల్లా సహకారకేంద్ర బ్యాంకుల్లో అకౌంట్ కలిగిన ఖాతాదారులందరూ తప్పనిసరిగా కేవైసీ చేయించుకోవాలని గొల్లపాలెం బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ఎన్.మాచర్రావు అన్నారు. బుధవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వినియోగదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవైసీ కోసం ఖాతాదారులు ఆధార్ కార్డు, పాన్‌కార్డు జిరాక్స్‌లతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను సమీపంలోని పీఏసీఎస్‌లో అందజేయాలన్నారు. కేవైసీ చేయించుకోకపోతే ఖాతాలు నిలిచిపోతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ మూలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నవీకరణ తప్పనిసరి

- సచివాలయాల్లో నవీకరణకు అవకాశం
- వేలిముద్రలు, చిరునామా, పుట్టిన తేదీ మార్పుల సమస్యకు పరిష్కారం
- నేటి నుంచి రెండు విడతలుగా ప్రత్యేక శిబిరాలు



వల్లూరు సచివాలయంలో ఆధార్ నవీకరణ చేస్తున్న ఉద్యోగి

కపిలేశ్వరపురం: సకల సేవలకూ ఆధార్ తప్పనిసరి కావడంతో ఆధార్ కార్డులోని వివరాలు సరిగా ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆధార్ నవీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన డ్రైవ్ నిర్వహిస్తుంది. అక్టోబర్ 25 నుంచి దశలవారీగా కేంద్రాలను పెంచుకుంటూ నవీకరణ ప్రక్రియను వేగవంతం చేస్తుంది. అందులో భాగంగా నేటి నుంచి రెండు విడతలుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలను నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించింది. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది.

వివరాలు సరిచేసుకోవడానికి...

పదేళ్ళ క్రితం ఆధార్ చేసినప్పుడు కొందరి వివరాలు తప్పుగా నమోదయ్యాయి. మరికొందరికి వేలిముద్రలు పడడం లేదు. ఇంకొందరైతే ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం వల్ల చిరునామా మార్చుకోవాల్సి ఉంది. వివరాల్లో తప్పుల వల్ల ప్రభుత్వ పథకాలను పొందడంలో తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో నవీకరణ చేసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోరుతున్నాయి. వేలి ముద్రలు, ఐరిష్, ఫొటో, వయసు, ఇంటి చిరునామా తదితర వివరాలను నవీకరించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాయి.

నవీకరణ షెడ్యూల్ ఇలా...

కపిలేశ్వరపురం మండలంలో గతేడాది అక్టోబర్ నుంచి నవీకరణ ప్రక్రియ సాగుతుంది. వాకతిప్ప, వడ్లమూరు, కోరుమిల్లి, కాలేరు, మాచర, నల్లూరు సచివాలయాల్లో ఆధార్ నవీకరణ సేవలందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు గురువారం నుంచి మరో విడత ప్రత్యేక శిబిరాల నిర్వహణ ప్రారంభం కానుంది. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాలాల్లో గురువారం నుంచి 24 వరకూ, ఫిబ్రవరి 7 నుంచి 10 వరకూ రెండు విడతలుగా శిబిరాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కపిలేశ్వరపురం మండలంలో ఈ నెల 19 నుంచి 21 వరకూ కోరుమిల్లి, అంగర–2 సచివాలయాల్లోను, 23 నుంచి 24 వరకూ కపిలేశ్వరపురం–2, నల్లూరు సచివాలయాల్లోను, ఫిబ్రవరి 7 నుంచి 8 వరకూ మాచర, కాలేరు, 9 నుంచి 10 వరకూ తాతపూడి, నేలటూరు సచివాలయాల్లోను ఆధార్ సేవలందించనున్నారు. ప్రింటర్, స్కానర్, ఐరిష్, వేలిముద్రల పరికరాలను ఎలా ఉపయోగించాలో కేంద్రాల్లోని సాంకేతిక నిపుణులకు ఇప్పటికే ప్రత్యేకంగా తర్ఫీదునిచ్చారు. ఆధార్ కార్డు లేనివారు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రక్రియ ఇలా..

ఆధార్ కార్డుల జారీ సంస్థ యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఐ) సంస్థ నవీకరణకు నిబంధనలను విడుదల చేసింది. ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోవాలనుకునే వారు సమీపంలో ఆధార్ నవీకరణ సేవలందిస్తున్న సచివాలయ కేంద్రానికి వెళ్ళాలి. పుట్టిన తేదీని సరిచేసుకునేందుకు రుజువుగా పదోతరగతి మెమో, పాస్‌పోర్టు, పాన్‌కార్డులను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. చిరునామా మార్పు కోసం బ్యాంక్ ఖాతా, పోస్టాఫీస్ ఖాతా, రేషన్ కార్డు, ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ అప్‌లోడ్ చేయాలి. చిన్నారులకు వారి తల్లిదండ్రుల వేలిముద్రలతో కార్డు జారీ చేస్తారు. ఐదేళ్ళు పూర్తయిన తర్వాత మాత్రమే పిల్లల వేలిముద్రలు, ఫొటో అప్‌డేట్ చేస్తారు. తొలిసారి ఆధార్ చేసుకునే పిల్లలకు ఉచితంగా చేస్తారు. పూర్తి బయోమెట్రిక్ అప్‌డేట్‌కు రూ.100, సవరణల కోసం రూ.50, ఆధార్ ప్రింట్‌కు రూ.30 చొప్పున మాత్రమే తీసుకుంటారు.

ఫింగర్ ప్రింట్, ఫోన్ నంబర్ అప్‌డేట్ చేసుకున్నాను



వల్లూరు సచివాలయంలో ఆధార్ నవీకరణ కేంద్రం నడుస్తుంది. నా ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్‌ను మార్చుకున్నాను. ఫింగర్ ప్రింట్‌లను అప్‌డేట్ చేసుకున్నాను. నవీకరణ ప్రక్రియ చాలా వేగంగా పూర్తయింది.

– గెద్దం ప్రమీల, వల్లూరు

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



క్షేత్ర స్థాయిలో సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నాం. ఆధార్‌ను నవీకరణ చేసుకోవడం ద్వారా ప్రభుత్వ పథకాల లబ్ధి పొందే విషయంలో సాంకేతిక సమస్యల ఇబ్బందులు తప్పుతాయి. ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.రామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ, కపిలేశ్వరపురం

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న చెల్లుబోయిన నరేన్, ఎంపీపీ భవాని తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని మాలపాడులో గ్రామ సర్పంచ్ నేమాల సుజన ప్రియాంక, సంతోష్ దంపతుల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్ బుధవారం ఉత్సాహంగా జరిగాయి. ఫైనల్స్‌లో రామచంద్రపురం పట్టణానికి చెందిన వైఎస్సార్ నగర్ జై భీమ్ టీమ్ విజేతగా, రన్నర్‌గా ఊలపల్లి టీమ్ నిలిచాయి. వైఎస్సార్ నగర్ జై భీమ్ టీం కెప్టెన్ దుర్గాప్రసాద్ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తనయుడు నరేన్ చేతుల మీదుగా ట్రోఫీ అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, గ్రామ ఉప సర్పంచ్ మేడిశెట్టి సూర్యారావు, చోడవరం ఎంపీటీసీ సాదే సుభద్ర, అర్జునుడు దంపతులు, సర్పంచ్ నేదూరి సంతోషమ్మ, జగజ్జీవన్‌రామ్ దంపతులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

పెదపూడి: గ్రామ పరిశుభ్రతకు నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని జి.మామిడాడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి అన్నారు. జి.మామిడాడలో 44 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తుల నిమిత్తం రూ.25 వేలు నగదును కార్మికులకు బుధవారం అందజేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



మండపేట ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు



రాయవరంలో అప్పటి ప్రిన్సిపాల్ శర్మను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

మండపేట: ఉద్యోగ, వ్యాపారం నిమిత్తం దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థుల ఒకరినొకరు పలకరించుకుంటూ గత జ్ఞాపకాలను గుర్తుచేసుకుని మురిసిపోయారు. వారి ఆత్మీయ సమ్మేళనానికి పట్టణంలోని కాపు కల్యాణ మండపం వేదికైంది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984–85 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం ఘనంగా జరిగింది. స్థానికంగా నివాసముంటున్న కొందరు పూర్వ విద్యార్థులు కమిటీగా ఏర్పడి వాట్సాప్ గ్రూప్ ద్వారా తమ బ్యాచ్ విద్యార్థులందరినీ ఏకం చేసి సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. అప్పట్లో వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి సత్కరించారు. ఒకరికొకరు సెల్ఫీలు తీసుకుని తమ సెల్ ఫోన్లలో బంధించి మురిసిపోయారు.

48 ఏళ్ల తరువాత అ'పూర్వ' సమ్మేళనం

రామచంద్రపురం రూరల్: చదువులమ్మ ఒడిలో కలిసి చదువుకుని దేశంలో ఎక్కడెక్కడో స్థిరపడిన స్నేహితులంతా 48 ఏళ్ల తరువాత అదే పాఠశాల ప్రాంగణంలో తిరిగి కలుసుకోవడం నిజంగా అ'పూర్వ' సమ్మేళనమే.. ఈ ఆత్మీయ కలయికకు రామచంద్రపురం మండలం వేగాయమ్మపేటలోని శ్రీ మహాలక్ష్మమ్మ హిందూ ఉన్నత పాఠశాల బుధవారం వేదికైంది. చిన్ననాటి స్నేహితులంతా కుటుంబ సమేతంగా పాఠశాలకు వచ్చి తమ తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులు భూపతిరాజు, సూర్యనారాయణరాజు, ఓలేటి సత్యనారాయణలను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భోగి మంటలు వేసి సంక్రాంతి పండగను స్నేహితులతో కలిసి ఆనందంగా జరుపుకున్నారు. కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన విస్సాప్రగడ కృష్ణమూర్తి, కాళ్ల సత్యనారాయణ, బొండా నాగేశ్వరరావు, పంపన సూర్యనారాయణ, చోడి జాన్‌రత్నం, గారపాటి బేబీ, చాగంటి మాణిక్యాంబా, కొమరిన విజయలక్ష్మిలను ప్రత్యేకంగా అభినందించారు.



వేగాయమ్మపేటలో ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం..

తమ చిన్ననాటి స్నేహితుడు చోడి జాన్‌రత్నం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకోవడం తమకు గర్వ కారణమంటూ స్నేహితులంతా కలసి జాన్‌రత్నం, రాజవేణి దంపతులను ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.

కదలాడిన జ్ఞాపకాలు..

రాయవరం: వారంతా రెండు దశాబ్దాల క్రితం జూనియర్ కళాశాలలో చదువుకుని జీవన పయనంలో ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. మళ్లీ ఇన్నేళ్ల తరువాత అదే కళాశాలలో పూర్వ విద్యార్థులుగా కలుసుకున్నారు. ఇంకేముంది చిన్ననాటి జ్ఞాపకాలు కళ్ల ముందు కదలాడాయి. 2000–02 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల కలయికకు రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల బుధవారం వేదికగా నిలిచింది. గతంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు ఒకే చోట కలుసుకున్నారు. తమ చిన్ననాటి స్నేహితులకు కుటుంబ సభ్యులను పరిచయం చేసుకున్న అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ శర్మ, అధ్యాపకులను దుశ్శాలువా, మెమెంటోతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఆత్మీయ సమ్మేళనానికి కృషి చేసిన పూర్వ విద్యార్థి కాలా శివశంకర్, స్వాతి దంపతులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు కొవ్వూరి ధర్మారెడ్డి, వాసంశెట్టి శ్రీను, భాగ్యలక్ష్మి, విమల, బాలకేదారీశ్వరుడు, రాబర్ట్ క్లైవ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుగు ప్రయాణాలు షురూ

కిటకిటలాడుతున్న ట్రావెల్స్ కార్యాలయాలు

మండపేట: సంక్రాంతి పండగ కోసం దూర ప్రాంతాల నుంచి స్వస్థలాలకు వచ్చినవారంతా తమ మనసుల్లో తీపి గుర్తుల్ని నింపుకుని తిరుగు పయనమవుతున్నారు. దీంతో బస్టాండులు, ట్రావెల్స్ కార్యాలయాలు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి పండగకు ముందు హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, విశాఖపట్నం, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చారు. కొందరైతే పండగ జరుపుకునేందుకు బంధువుల ఇళ్లకు వెళ్లారు. సంక్రాంతి పండగలు మంగళవారం జరిగిన ముక్కనుమతో ముగిశాయి. సాధారణంగా ముక్కనుమ రోజునే తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకుంటుంటారు. అయితే మంగళవారం సెంటిమెంట్‌తో అధిక శాతం మంది బుధవారం బయలుదేరి వెళుతున్నారు. మండపేటలోని బస్టాండు, కలువపువ్వు సెంటర్‌తో పాటు మండలంలో ఎక్కడ చూసినా బస్టాండుల వద్ద ప్రయాణికుల రద్దీ కనిపించింది. క్షేమంగా వెళ్లి రండంటూ కుటుంబసభ్యులు తమ వారిని దగ్గరుండి సాగనంపుతున్నారు. హైదరాబాద్, విశాఖపట్నం, విజయనగరం, బెంగుళూరు, తిరుపతి తదితర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల రిజర్వేషన్లు ఖాళీ లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు బస్సులను ఆశ్రయిస్తున్నారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక సర్వీసులు సైతం రద్దీగా నడుస్తున్నాయి. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, రైల్వే రిజర్వేషన్ల కోసం వచ్చేవారితో పట్టణంలోని ట్రావెల్స్ కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి.



మండపేట బస్టాండులో ప్రయాణికుల రద్దీ

20వ తేదీ నాటికి గృహసారథుల వివరాలివ్వాలి

మండపేట: వలంటీర్లకు తోడుగా నియమించనున్న గృహసారథుల వివరాలను 20వ తేదీ సాయంత్రంలోగా అందజేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో కోరింది. గృహసారథి పేరు, వయసు, పుట్టిన తేదీ, బూత్‌నంబర్, విద్యార్హత, క్యాస్ట్, సబ్‌క్యాస్ట్, ఫోన్ నంబర్, వాట్సాప్ నెంబర్ తదితర వివరాలు సమగ్రంగా ఉండాలన్నారు. మరింత మెరుగైన పాలన లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి సంబంధించి నియోజకవర్గంలోని జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, మండల కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు తమ పరిధిలోని వారి వివరాలను ఏకాభిప్రాయాలతో అందజేయాలని కోరారు.

నేటి నుంచి సచివాలయాల్లో ఆధార్ సేవలు

కపిలేశ్వరపురం: మండలంలోని పలు సచివాలయాల్లో గురువారం నుంచి ఆధార్ నవీకరణ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల 19 నుంచి 21 వరకూ కోరుమిల్లి, అంగర–2 సచివాలయాల్లోను, 23 నుంచి 24 వరకూ కపిలేశ్వరపురం–2, నల్లూరు సచివాలయాల్లోను, ఫిబ్రవరి 7 నుంచి 8 వరకూ మాచర, కాలేరు, 9 నుంచి 10 వరకూ తాతపూడి, నేలటూరు సచివాలయాల్లోను ఆధార్ సేవలందిస్తారని ఎంపీడీఓ తెలిపారు. ఆధార్ కార్డులో తప్పులను సరిచేసుకోవడంతో పాటు వేలిముద్రలు, చిరునామాలను నవీకరించుకోవచ్చని ఎంపీడీఓ చెప్పారు.

కృష్ణారెడ్డికి అభినందనలు



కృష్ణారెడ్డిని అభినందిస్తున్న రంగంపేట వైఎస్సార్ సీపీ నాయకులు

రంగంపేట: అనపర్తి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సబ్బెళ్ళ కృష్ణారెడ్డిని బుధవారం రంగంపేట మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన కృష్ణారెడ్డికి సముచిత స్థానం కల్పించినందుకు అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

వెదురుపాకలో పొలంబడి



రైతులకు పొలంబడి నిర్వహిస్తున్న ఏవో ప్రభాకర్

రాయవరం: మండలంలోని వెదురుపాకలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం బుధవారం మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. జీవన ఎరువులు ఉపయోగించడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని సూచించారు.

హోప్ వే మినిస్ట్రీస్ సేవలు ప్రశంసనీయం



అంగరలో రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేస్తున్న ఎంపీడీఓ

కపిలేశ్వరపురం: హోప్ వే మినిస్ట్రీస్ స్వచ్ఛంద సంస్థ సేవలు ప్రశంసనీయమని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. అంగరలోని హోప్ వే మినిస్ట్రీస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు మోర్త సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు వ్యవసాయ పనిముట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఓఎన్‌జీసీ రహదారి సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ అడ్డాల శ్రీనివాస్ మాట్లాడుతూ సంస్థ సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కిరణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో విజేత రామచంద్రపురం జట్టు

ట్రోఫీలను అందించిన ఎంపీ బోస్, మంత్రి వేణు



రామచంద్రపురం జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతులను అందిస్తున్న ఎంపీ బోస్, మంత్రి వేణు

రామచంద్రపురం: స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో నిలిచాయి. రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర, జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో రామచంద్రపురం జట్ల క్రీడాకారులు తమ సత్తా చాటారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఫైవ్ అండ్ ఫైవ్ విభాగంలో రామచంద్రపురం జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో సీబీఏ రాజమహేంద్రవరం, తృతీయ స్థానంలో డీఎస్ఏ కాకినాడ జట్టు, నాలుగో స్థానంలో జి.మామిడాడ జట్టు నిలిచాయి. త్రీ అండ్ త్రీ రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పురుషుల విభాగంలో డీఎస్ఏ కాకినాడ జట్టు ప్రథమ, రామచంద్రపురం జట్టు ద్వితీయ, రామచంద్రపురం–ఏ జట్టు తృతీయ, సీబీఏ నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాయి. త్రీ అండ్ త్రీ రాష్ట్ర స్థాయి మహిళల విభాగంలో రామచంద్రపురం జట్టు ట్రోఫీ దక్కించుకుంది. జి.మామిడాడ ద్వితీయ, రామచంద్రపురం–బీ తృతీయ, అమలాపురం నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్‌లు ట్రోఫీలు, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ చెలికాని స్టాలిన్, ఎంపీ బోస్ తనయుడు సూర్యప్రకాశ్, పారిశ్రామిక వేత్త అడ్డూరి జగన్నాథవర్మ, కౌన్సిలర్లు తోట అమ్మాజీ, కేతా శ్రీను, పట్టణ వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

కపిలేశ్వరపురం: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు వర్ధంతిని బుధవారం పలు గ్రామాల్లో నిర్వహించారు. కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వల్లూరు తదితర గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు అభిమానులు, టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి చాటిన వ్యక్తి ఎన్టీఆర్

మండపేట: తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచం నలుదిక్కులా చాటిచెప్పిన గొప్ప వ్యక్తి ఎన్‌టీ రామారావు అని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మాజీ సీఎం ఎన్‌టీఆర్ వర్ధంతిని బుధవారం ఎమ్మెల్యే వేగుళ్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కరాచీ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే వేగుళ్ల పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాయవరంలో ఎన్టీఆర్ వర్ధంతి

రాయవరం: పేద ప్రజల సంక్షేమానికి నిరంతరం పరితపించిన ఎన్టీఆర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని కూర్మాపురంలో ఎమ్మెల్సీ వీవీవీచౌదరి పేర్కొన్నారు. బుధవారం ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

తెలుగు వారి ఆత్మగౌరవ పతాక ఎన్టీఆర్

రామచంద్రపురం రూరల్: తెలుగు వారి ఆత్మగౌరవాన్ని దశ దిశలా చాటిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని పలువురు కొనియాడారు. మండలంలోని నెలపర్తిపాడులో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 27వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



నెలపర్తిపాడులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రపురం: బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ పాటుపడ్డారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలో ఎన్టీఆర్ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు.